సర్కారు విద్యకు కూటమి ప్రభుత్వ గ్రహణం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట
- నాడు–నేడుతో మారిన బడులు
- అమ్మఒడి పథకంతో పేద పిల్లలు బడిబాట
- నేడు కూటమి ప్రభుత్వంలో పేద విద్యార్థులపై నిర్లక్ష్యం
- అమ్మకువందనంకు పంగనామం
- కొత్తగా రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల నిర్వీర్యానికి చర్యలు



2019కు ముందు కిస్తీపురం పాఠశాల దుస్థితి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడుతో మారిన పాఠశాల రూపురేఖలు

నాడు–నేడుతో మారిన బడి

ఈ చిత్రంలో కనిపిస్తున్నది వింజమూరు మండలం కిస్తీపురం గ్రామంలోని పాఠశాల భవనం. దీనిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం ఫేజ్–1 కింద అన్ని వసతులతో ఆధునీకరించారు. 2019కు ముందు పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు వచ్చేవారు కాదు. తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేకున్నా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి ప్రైవేట్ బడుల్లో చదివించే వారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమం ద్వారా బడి రూపు రేఖలు మార్చి విద్యా విధానంలో మార్పులు తీసుకురావడంతో తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపడం మానేసి ప్రభుత్వ బడికి పంపారు. అయితే కూటమి ప్రభుత్వం గతేడాది అమ్మకు వందనం పథకం నిలిపివేయడంతో పిల్లల సంఖ్య తగ్గిపోయింది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న తల్లిపేరు చెనికల మల్లేశ్వరి. వరికుంటపాడు మండలం వేంపాడు గ్రామం. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిలో ఒకరు ప్రస్తుతం 8వ తరగతికి వస్తున్నారు.మరొకరు పదో తరగతి పూర్తి చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి ద్వారా తల్లి బ్యాంకు ఖాతాలో రూ.60వేలు నగదు జమైంది. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, బ్యాగులు ఉచితంగా అందజేయడంతో పైసా ఖర్చు కాకుండా చదివించారు. కానీ కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం పథకాన్ని అమలు చేయకపోవడంతో ఇద్దరు పిల్లలకు రావాల్సిన రూ.30వేలు రాలేదని ఆమె వాపోయింది. దీంతో అప్పు చేసి పిల్లలను చదించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యావ్యవస్థ నిర్వీర్యం



ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా డిజిటల్ విద్యను అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాఠశాలలను రేషలైజేషన్ పేరుతో కుదిస్తూ విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం దారుణం.

అప్పు చేసి చదివిస్తున్నాం



నాకు ఇద్దరు పిల్లలు. కూతురు షేక్ సనా బిల్లుపాడు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కుమారుడు షేక్ మహమ్మద్ సాధిక్ స్థానికంగా ఐదో తరగతి చదువుతున్నాడు. గత ప్రభుత్వ కాలంలో నాలుగేళ్ల పాటు ఏటా అమ్మఒడి నగదు బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో ఖర్చులకు ఇబ్బంది లేకుండా పిల్లలను చదివించగలిగాం. ప్రస్తుత ప్రభుత్వం తల్లికి వందనం కింద ఇద్దరికి నగదు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో పిల్లల చదువుల ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తోంది. – షేక్ షకీలా, యనమదల, చేజర్ల మండలం

గత ప్రభుత్వంలో విద్యార్థుల కోసం చేసిన ఖర్చులు

ఉదయగిరి నియోజకవర్గం

పథకం	విద్యార్థుల సంఖ్య	నగదు(రూ.కోట్లలో)
అమ్మఒడి	30,290	120.56
విద్యాదీవెన	14,253	82.17
వసతిదీవెన	13,602	47.21
ట్యాబ్స్	1816	1.98
గోరుముద్ద	14,750	15.95

ఆత్మకూరు నియోజకవర్గం

పథకం	విద్యార్థుల సంఖ్య	నగదు(రూ.కోట్లలో)
అమ్మ ఒడి	31,570	122.81
విద్యాదీవెన, వసతి దీవెన	30,650	148.85

పిల్లలను చదివించేందుకు కష్టపడుతున్నాం



నాకు ఇద్దరు కుమారులు. ఒకరు డిగ్రీ, మరొకరు బీటెక్ చదువుతున్నారు. పేద కుటుంబమైనా పిల్లలను బాగా చదివించాలని ఇద్దరం కూలీ పనులకు వెళ్తూ కష్టపడుతున్నాం. గత ప్రభుత్వంలో ఫీజురీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అందడంతో ఇబ్బంది లేకుండా చదువు సాగింది. ప్రస్తుత ప్రభుత్వం పథకాలను అమలు చేయకపోవడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పథకాలను అమలు చేయాలి.
–మాముడూరు ప్రసాద్, గండ్లవేడు, ఆత్మకూరు మండలం

ఉదయగిరి/ఆత్మకూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. అమ్మఒడి పథకాన్ని అమలు చేసి పేద పిల్లలను బడిబాట పట్టించారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ అందజేశారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారు. తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించారు. వసతిదీవెన, విద్యాదీవెన కింద ఉన్నత విద్య చదివే విద్యార్థులకు చేయూతనందించారు. విదేశీ దీవెన పేరుతో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు చదువులకు రూ.లక్షల్లో ఆర్థిక సాయం అందజేశారు. పేద కుటుంబాల విద్యార్థులకు వైద్యవిద్యావకాశాలను కల్పించేందుకు మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నేడు కూటమి ప్రభుత్వం సర్కారు బడులను గాలికి వదిలేసింది. ఏడాది కాలంలోనే విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించింది. అమ్మకు వందనం పథకానికి మంగళం పలికి విద్యార్థులను బడికి దూరం చేసింది. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు మంగళం పలికింది. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు చర్యలు చేపడుతోంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





ఘటనా స్థలంలో గాయపడిన బండి వెంకటేశ్వర్లు, రాచాల నాగరాజు

సంగం: మండలంలోని సిద్దీపురం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. సంగంకు చెందిన బండి వెంకటేశ్వర్లు మోటార్‌సైకిల్‌పై సిద్దీపురం వెళ్లి తిరిగి వస్తున్నాడు. నెల్లూరు రామకోటయ్యనగర్‌కు చెందిన రాచాల నాగరాజు మోటార్‌సైకిల్‌పై సంగం నుంచి నెల్లూరుకు వెళ్తున్నాడు. సిద్దీపురం సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనచోదకులు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థ

దగదర్తి: మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలను విధిస్తుండడంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రైతులు రెండోపంటకు బోర్ల కింద నార్లు పోసుకుని ఉన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా కోతలు విధిస్తుండడంతో అవస్థ పడుతున్నారు. అలాగే వ్యాపారులు, గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సమాచారం కోసం సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసిన విద్యుత్ సిబ్బంది సరైన సమాధానం చెప్పడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం విద్యుత్ కోతలు లేవని, గృహ అవసరాలకు 24 గంటలు, రైతులకు పగటిపూటే 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెబుతున్నా అమలుకు నోచుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

ఆత్మకూరురూరల్: రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని హెచ్చరించారు. మండలంలోని అశ్వనీపురంలోని 30వ నంబరు రేషన్ షాపును శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కాగా ఆత్మకూరులోని 18వ నంబరు రేషన్ షాపును ఇన్‌చార్జి తహసీల్దార్ సోమ్లా నాయక్ తనిఖీ చేశారు.



అశ్వనీపురం రేషన్ షాపును తనిఖీ చేస్తున్న ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని

నేటి నుంచి క్లస్టర్ల వారీగా పొగాకు వేలం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం నుంచి క్లస్టర్ల వారీగా పొగాకు వేలం ప్రక్రియను నిర్వహించనున్నట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. 31న క్లస్టర్–1 పరిధిలోని చిలకపాడు, ఇర్లపాడు, ఖాదర్‌పూర్, మర్రిపాడు, రాజులపాడు, శెట్టిసముద్రం, సన్నేవారిపల్లి, పెగళ్లపాడు, 2వ తేదీ క్లస్టర్–2 పరిధిలోని తిక్కవరం, వెంగంపల్లి, నూతల, ఖాదిరినేనిపల్లి, నెర్దనంపాడు, నాగరాజుపాడు, పోలిరెడ్డిపల్లి, పల్లవోలు, భీమవరం, చిన్నమాచనూరు, పొంగూరుకండ్రిక, పెద్దమాచనూరు, 3న క్లస్టర్–3 పరిధిలోని పొంగూరు, కేతిగుంట, పల్లెపాడు, రామానాయుడుపల్లి, నందవరం, రాంపల్లి, 4న క్లస్టర్–4 పరిధిలోని వరికుంటపాడు, జంగాలపల్లి, తురకపల్లి, భైరవరం, మండలనాయుడుపల్లి, అప్పసముద్రం, దుత్తలూరు, 5న క్లస్టర్–5 పరిధిలోని చవటపల్లి, గుండెమడకల, నల్లగొండ్ల, బొటికర్లపాడు, బంట్లపల్లి, గండ్లవీడు, ఖాన్‌సాహెబ్‌పేట, ఎర్రబల్లి గ్రామాలకు సంబంధించిన పొగాకు బేళ్ల అమ్మకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. 6న క్లస్టర్–6 పరిధిలోని రావులకొల్లు, అల్లీపురం, బీ చిరువెళ్ల, డీసీపల్లి, కరటంపాడు, కోనసముద్రం, నారంపేట, నల్లరాజుపాళెం, వెన్నవాడ, 9న క్లస్టర్–7 పరిధిలోని రామస్వామిపల్లి, బుక్కాపురం, పమిడిపాడు, నెల్లూరుపాళెం, కుప్పూరుపాడు, జాలయ్యనగరం, చంద్రపడియ, చిరమన, టీ ముస్తాపురం, టీఎస్‌పల్లి, వెంకటరావుపల్లి, పేరారెడ్డిపల్లి, పొనుగోడు, అనంతసాగరం గ్రామాలకు సంబంధించి అమ్మకాలు చేపట్టనున్నట్లు వివరించారు. బ్యారెన్‌కు రెండు, అర బ్యారెన్‌కు ఒకటి చొప్పున బేళ్లను కొనుగోలు చేస్తామని చెప్పారు. పొగాకు బేళ్లు 50 కేజీల కన్నా తక్కువ, 150 కేజీలకు మించి ఉన్నా కొనుగోలుకు తిరస్కరించడం జరుగుతుందని తెలిపారు. రైతులు కాటాలు వేసే సమయంలో దగ్గరుండి నంబర్లు వేయించుకోవాలని కోరారు.

267 పొగాకు బేళ్ల విక్రయం

డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 267 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 341 బేళ్లు రాగా, 267 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.200, సగటున రూ.235.40 ధర పలికిందని వివరించారు.

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 463బేళ్లను తీసుకురాగా, 358 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ. 280, కనిష్ఠంగా రూ.200, సరాసరిన రూ. 243.67 ధర లభించిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

దగదర్తి: మండల కేంద్రమైన దగదర్తిలో శుక్రవారం ఇరువర్గాల నడుమ చోటు చేసుకున్న ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. దగదర్తిలోని వెలుపోడు సెంటర్‌లోని ఓ కూల్‌డ్రింక్ షాప్ వద్ద పైడి పెంచలయ్య, సురేష్ నడుమ చిన్నపాటి విషయమై నెలకొన్న వాగ్వివాదం కాస్తా ఇరువర్గాల ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో పెంచలయ్య తలపై గాజుసీసాతో దాడి చేయడంతో బలమైన గాయమైంది. పెంచలయ్యను బంధువులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

వైభవంగా గంధ మహోత్సవం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పంచాయతీ పరిధిలోని ఖాన్‌సాహెబ్‌పేటలో హజరత్ సయ్యద్ అబ్దుల్‌ఖాదర్‌ఖాన్ సాహెబ్ వారి గంధ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గంధాన్ని గ్రామంలో ఊరేగించి ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో గంధమహోత్సవంలో పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని 5,508 మంది సామాజిక పింఛన్ లబ్ధిదారులకు సంబంధించి రూ.2.43 కోట్ల నగదును సచివాలయ సిబ్బంది శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ముందస్తుగా నగదు పంపిణీ చేస్తున్నామని, ఈ విషయాన్ని లబ్ధిదారులు గుర్తించి పింఛన్ నగదు తీసుకోవాలని కోరారు.

సంగం: మండలంలోని 6547 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.2.82కోట్ల నగదును సచివాలయ సిబ్బంది శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ షాలెట్ శుక్రవారం తెలిపారు. జూన్ 1 ఆదివారం సెలవు దినం కావడంతో ముందస్తుగా పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. స్పౌస్ కింద కొత్తగా 77 మందికి పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు. మండలంలోని వీర్లగుడిపాడులో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

రేషన్ షాపుల తనిఖీ

వరికుంటపాడు: మండలంలోని రేషన్‌షాపులను తహసీల్దార్ హేమంత్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్ బండ్ల ద్వారా ఇంటింటికి సరుకుల పంపిణీని ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. రేషన్ షాపుల వద్దకే వెళ్లి లబ్ధిదారులు సరుకులు తీసుకోవాలన్నారు. రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ చెంచయ్య, వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఉన్నారు.

పొదుపు సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

వింజమూరు(ఉదయగిరి): పొదుపు సభ్యులను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని నూతన వెలుగు ఏపీఎం బీ సుధాకర్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌సీఎల్‌బీ సర్వే ద్వారా ఏడాదికి ఏ సభ్యురాలికి ఎంత అవసరమో గుర్తించి ఆ మేరకు బ్యాంకు లింకేజీ ద్వారా స్త్రీనిధి లేదా రుణాలు మంజూరు చేస్తామన్నారు. సీసీలు సుశీల,సునీత, లక్ష్మీకుమారి, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలకు నూతన హెచ్‌ఎంలు

ఉదయగిరి రూరల్: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన వారి స్థానంలో నూతన హెచ్‌ఎంలను నియమించినట్లు ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. గండిపాళెం జెడ్పీహెచ్‌ఎస్‌కు ఆర్ రవీంద్ర, వెంగళరావు నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు షేక్ హసీనా, అప్పసముద్రం జెడ్పీహెచ్‌ఎస్‌కు జీ శ్రీనివాసులు, బిజ్జంపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌కు జే మాధవరావు, కృష్ణంపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌కు మాసూం సత్తార్, వెంకట్రావుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు వెంకటేశ్వర్లును నియమించినట్లు వివరించారు.

భీమవరప్పాడు ఉపసర్పంచ్ మృతి

కొండాపురం: భీమవరప్పాడు పంచాయతీ ఉపసర్పంచ్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు విడవలపాటి మాల్యాద్రి (58) గురువారం రాత్రి మృతి చెందారు. గురువారం ఉదయం మాల్యాద్రి గుండెపోటుకు గురవగా కుటుంబసభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 10 గంటలకు ఆయన మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా శుక్రవారం మాల్యాద్రి మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మాల్యాద్రి భార్య భీమవరప్పాడు సర్పంచ్ గోవిందమ్మ కు సానుభూతి తెలిపారు.

అహల్యాబాయి జయంతి

ఉదయగిరి: స్థానిక శివాలయం ప్రాంగణంలో బీజేపీ ఆధ్వర్యంలో రాజమాత అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. మొఘలుల దురాక్రమణలను ఎదిరించి హిందూ ఆలయాలను పరిరక్షించిన మరాఠ యోధురాలు అహల్యాబాయి అని బీజేపీ నాయకులు కొనియాడారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ఉదయగిరి/జలదంకి: ఉదయగిరి, జలదంకి మండలాల్లోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓలు ఆంజనేయులునాయక్, బీ శైలజ శుక్రవారం తెలిపారు. 50 శాతం సబ్సిడీపై జీలుగలు కేజీ రూ.62, జనుములు కేజీ రూ.55, పిల్లిపెసర్లు కేజీ రూ.90కు అందజేస్తున్నామని చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు భూములకు సంబంధించిన పత్రాలు, ఆధార్ కార్డుతో రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే విత్తనాలు అందజేస్తామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఉదయగిరి రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు అవుల రోశయ్యయాదవ్ ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. ఉదయగిరిలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కృష్ణాపురం నీటి సంఘం అధ్యక్షుడు బేరి విష్ణువర్ధన్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

భూవివాదం నేపథ్యంలో సోదరిపై దాడి

ఆత్మకూరు: భూవివాదం నేపథ్యంలో అక్కపై బంధువులతో కలిసి చెల్లెలు మారణాయుధాలతో దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. సంగం మండలం జెండాదిబ్బకు చెందిన పోకూరి ఆదిశేషమ్మకు ఆమె తల్లి కొంత భూమిని రాసిచ్చింది. అయితే సదరు భూమిలో తనకు భాగం రావాలని ఆదిశేషమ్మతో చెల్లెలు తరచూ గొడవ పడుతుండేది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం పొలంలో పనిచేసుకుంటున్న ఆదిశేషమ్మపై చెల్లెలు సీతారావమ్మ, ఆమె కుమార్తెలు కవిత, మహిత, సమీప బంధువు చెన్నకృష్ణయ్య మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఆదిశేషమ్మ కుమార్తె చంద్రకళ ఘటనా స్థలానికి చేరుకోగా ఆమెపైన దాడి చేసేందుకు ప్రయత్నించారు. వారి నుంచి తప్పించుకుని తీవ్ర గాయాలపాలైన ఆదిశేషమ్మను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి వెంగమాంబ బ్రహ్మోత్సవాలు

దుత్తలూరు: నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలను జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. నర్రవాడలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశాన్ని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ అధికారులకు సూచించారు. వెంగమాంబ దంపతుల కల్యాణాన్ని ఎక్కువ మంది చూసేలా భారీ వేదికను ఏర్పాటు చేయాలన్నారు. మద్యం విక్రయాలు జరగకుండా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పూజాసామగ్రి, ఎండుకొబ్బరి, కొబ్బరికాయల దుకాణాల వద్ద ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికలను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు ఇబ్బందులు పడకుండా తగిన వసతులు కల్పించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. తొలుత కావలి ఆర్డీఓ వంశీకృష్ణ మాట్లాడారు. ఆలయ ఈఓ ఉషశ్రీ, వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్, తహసీల్దార్ యనమల నాగరాజు, డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున, సర్పంచ్ నాగయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాకర్ల, ఆర్డీఓ వంశీకృష్ణ

క్లుప్తంగా

ముగిసిన చిత్రలేఖనం శిక్షణ తరగతులు



ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సంస్కార భారతి ఉచిత చిత్రలేఖన శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు ఎంజీఆర్ వ్యవసాయ కళాశాల డీన్ కృష్ణారెడ్డి, ఎస్సై ఇంద్రసేనారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. శిక్షణ ఇచ్చిన చిత్ర కళాకారుడు సుదర్శన్‌ను సత్కరించి అభినందించారు.

పొదుపుపై అవగాహన



ఉదయగిరి రూరల్: పట్టణంలోని సినిమాహాల్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు ఆర్థిక అంశాల నిర్వహణ–పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సునీత మాట్లాడుతూ కిశోర బాలికలు భవిష్యత్ అవసరాల కోసం ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత పాల్గొన్నారు.

వెంకయ్యస్వామి ఆరాధన



సోమశిల: అనంతసాగరం మండలం వడ్డిపాళెంలో భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం వేడుకగా నిర్వహించారు. వెంకయ్యస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు.

గిరిజన కుటుంబానికి చేయూత

ఆత్మకూరు: మండలంలోని చెర్లోయడవల్లి గ్రామానికి చెందిన గిరిజనులైన సుబ్రహ్మణ్యం, జ్ఞానమ్మ కుటుంబానికి మర్రిపాడు మండలానికి చెందిన దాత నాగేశ్వరరావు చేయూతనందించారు. శుక్రవారం ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని చేతుల మీదుగా మేకల కొనుగోలుకు రూ.లక్ష నగదును అందజేశారు. నలుగురి పిల్లలను చదివించేందుకు ఏర్పాట్లు చేశామని, వారి చదువు పర్యవేక్షణ బాధ్యతలను ఓ టీచర్‌కు అప్పగించామని ఆయన తెలిపారు.

12 డ్రమ్ముల చికెన్ వ్యర్థాల పట్టివేత

సంగం: మండలంలోని దువ్వూరు వద్ద అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సంగం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. 12 డ్రమ్ముల్లోని చికెన్ వ్యర్థాలను సంగం కొండ సమీపంలో గుంతతీసి పూడ్చివేశారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

కాకాణి అరెస్ట్ అప్రజాస్వామికం



వరికుంటపాడు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని ఉదయగిరి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు ఎరగూటి చెంచిరెడ్డి ఖండించారు. శుక్రవారం ఆయన వరికుంటపాడులో 'సాక్షి'తో మాట్లాడారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన కేసులన్నీ అక్రమ కేసులేనని, ఆయన కడిగిన ముత్యంలా బయటకువస్తారన్నారు. కూటమి ప్రభుత్వ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులను పెడుతోందని విమర్శించారు.

అనంతసాగరంలో ఓ మోస్తరు వర్షం



అనంతసాగరంలోని కొత్తబస్టాండ్ వెనుకవీధిలో నిలిచిన వర్షపునీరు

సోమశిల: అనంతసాగరం మండలంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి అనంతసాగరంలోని పలు కాలనీల్లోని రోడ్లపై నీరు నిలిచిపోయింది. దీంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. కాగా రెండో పంట సాగుకు సిద్ధమవుతున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు.